ఆహార భద్రత చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: వినియోగదారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆహార భద్రత చట్టం పై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు కల్పించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వినియోగదారుల సంక్షేమ సేవా సంఘం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు కంబిడి సువర్ణ రాజు, వినియోదారుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు కొర్ర బైరాగిమూర్తి, సెక్రెటరీ టి.రామస్వామి, కిల్లో. వాసు, సీదరి. చందు, మర్రి. సోంబాబు, కిల్లో. నాని కన్స్యూమర్ క్లబ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సంఘం సభ్యులు

అక్రమ కేసులపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:జీఓ 3ను పునరుద్ధరణ చేసి చట్టబద్ధత కల్పించాలని, సిపిఎం నేతలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆ పార్టీ నేతలు నిరసన చేపట్టారు. సిపిఎం నేతలు ఎం.ఎం.శ్రీను, పాంగి పాటుబోయి సత్యనారాయణ, సోలాగం గసిరం దొర, కొర్ర దోంబ్రులపై అక్రమంగా కేసులు బనాయించడం రాజ్యాంగ విరుద్ధమని హెచ్చరించారు. అక్రమ కేసులను ఎత్తివేయాలని సీపీఎం మండల నాయకుడు ఎం.ఎం.శ్రీను డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో జీవో 3కు చట్టబద్ధత కల్పించి ఆదివాసి గిరిజన నిరుద్యోగులకు నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పోరాటం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పాలన చేస్తూ నాయకులపై ఉక్కు పాదం మోపడం సరికాదనారు. ఆదివాసి గిరిజనుల పక్షాన నిలబడి శాంతి యూతంగా సమస్యలు పరిష్కరించాలని పోరాటం చేస్తుంటే జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మండల పోలీసు శాఖను అడ్డంగా పెట్టుకుని అక్రమ కేసులు పెట్టి ప్రజల గొంతు నొక్కుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ బెదిరింపులకు ఉద్యమాలు ఆపేది లేదని హెచ్చరించారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి

ప్రజాశక్తి-ఎటపాక

మిచౌంగ్ తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని తోటపల్లి, కాపవరం గ్రామాల్లో తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి రైతులు ఇప్పటికే ఎకరానికి లక్షల్లో పెట్టుబడులు పెట్టారని, పంట చేతికందే సమయంలో తుఫాన్ వల్ల పంట నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అధికారులతో పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు తోటకూరి రాంబాబు, గంజి చిన్న, గొల్లపల్లి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

వ్యవసాయ శాఖ అధికారులు ఎక్కడ ?

తడిసిన ధాన్యాన్ని చూపుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- చింతపల్లి: తుఫాను తీరం దాటి నేటికీ మూడు రోజులు దాటినా నష్టపోయిన రైతుల పంటలను సర్వే చేయడంలో వ్యవసాయ శాఖ అధికారుల జాడ కానరాలేదని సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ తెలిపారు. తాజంగి పంచాయతీ కేంద్రంలోని లక్కేపుట్టు వీధిలో శనివారం వంతల చిరంజీవికి చెందిన ధాన్యాన్ని పరిశీలించారు. తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు రెండు ఎకరాల్లోని 36 బస్తాల ధాన్యం మొలకలు వచ్చాయన్నారు. మెట్ట గ్రామంలోని కిల్లో భగవాన్, కిల్లో జగత్‌ల వరి మొలకలు వచ్చాయని తెలిపారు. నష్టపోయిన పంటలను గుర్తించడానికి సంబంధిత శాఖ అధికారులు పర్యటించకపోవడం దారుణమని మండి పడ్డారు. తాజంగి చుట్టుపక్కల గ్రామాల్లో బాసింగి కొత్తూరు, చేరువీధి గ్రామాల్లో తడిసిచ ధాన్యాన్ని పరిశీలించారు. కలెక్టర్ స్పందించి తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి తక్షణమే పరిశీలనకు సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్ర సాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వంతల రాము, మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మండలంలో ఐటిడిఎ పిఒ విస్తృత పర్యటన

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కావూరి చైతన్య శనివారం చింతూరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా గొంది గూడెం జిపిఎస్ స్కూల్‌ను సందర్శించి స్వచ్ఛంద సంస్థ పాఠశాల కోసం నిర్మించిన రేకుల షెడ్‌ను ప్రారంభించారు. అనంతరం నిమ్మల గూడెం, కల్లేరు, కాయుగురు గ్రామాలలో మిచౌంగ్ తూఫాన్‌కు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం మోతుగూడెం ప్రాథమిక వైద్యశాలను సందర్శించి రోగులకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. చింతూరులో కొత్తగా నిర్మిస్తున్న సచివాలయం భవనాన్ని సందర్శించి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ఇంజనీర్‌ను ఆదేశించారు. అనంతరం విఆర్ పురం మండలంలోని పాపికొండలు బోటింగ్ పాయింట్‌ను సందర్శించి ప్రయాణికులకు బోట్‌లో అందుతున్న సౌకర్యాలు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమాలలో ఎన్జీవో సంస్థ ప్రతినిధులు సుజాత, ఐటిడిఎ ఏపీవో శ్రీధర్ అధికారులు పాల్గొన్నారు.

గొందుగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, స్థానికులతో ఐటిడిఎ పిఒ చైతన్య తదితరులు

బస్సుల మరమ్మతుతో ఇక్కట్లు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలం లోని రంగశీల పంచాయతీ బలోర్ద్ లో గ్రామంలో శనివారం అరుకు నుంచి పాడేరు వస్తున్న ఆర్టీసీ బస్సు మొరాయించింది. దీంతో ప్రయాణికులు దిగి బస్సును చేయి చేయి వేసి నెట్టారు. బస్సు పాడేరుకు బయలుదేరింది. కాలం చెల్లిన బస్సులతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. పాడేరు నుంచి అరుకు వెళ్లేందుకు 3గంటల సమయం పడుతుంది. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా నూతన బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బస్‌ను నెడుతున్న ప్రయాణికులు

పశువైద్యాధికారిని నియమించాలి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని కూటూరు పశువుల ఆసుపత్రిలో రెండేళ్లగా వైద్యులు కనిపించడం లేదని, తక్షణమే పశువైద్యులను నియమించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇక్కడ ఎవరు పని చేస్తున్నారో, ఏ ఆసుపత్రిలో పోస్టులు ఖాళీగా ఉన్నాయో కూడా అధికారులకు తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. తుఫాన్ కారణంగా పశువులకు అనేక జబ్బులు వస్తాయని, డాక్టర్‌తో పాటు హాస్పటల్‌లో మందులు కూడా సరిగా లేక, ఉన్న కాంపౌండర్లు కూడా వైద్యం చేయలేదని స్థితి నెలకొందన్నారు. తక్షణమే ప్రభుత్వం, జిల్లా అధికార్లు స్పందించి పశువైద్యుని పోస్టును భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సర్పంచ్ బి వెంకమ్మ, ఎంపిటిసి అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

డుంబ్రిగుడలో వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:కాంగ్రెస్ పార్టీ జాతీయ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ 77వ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జన్మదిన కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి చిన్నస్వామి, నాయకులు టి.సోమేశ్వరరావు, స్థానిక మండల అధ్యక్షుడు బి.మోహన్రావు, జి.మదన్‌రావు, పద్మ, పి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సమరెడ్డి బాలకృష్ణ ఆధ్వర్యంలో సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్రంలో రావాలి సంక్షేమం తేవాలి. అంటూ నినాదాలు చేశారు. ముందుగా కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సమరెడ్డి బాలకృష్ణ మీడియాతో మాట్లాడుతూ, దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించడానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డిని శుభాకాంక్షలు తెలియజేశారు. ఆంధ్ర రాష్ట్రంలో కూడా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాడేరు మండల అధ్యక్షురాలు కృష్ణకుమారి, బాలనాయుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అప్పలనరసి, జిల్లా కాంగ్రెస్ కోఆర్డినేటర్ కూడా బాలకృష్ణ, పాడేరు, జిమాడుగుల మండలాల ఇన్చార్జిలు వంతల కృష్ణ, బాబూరావు, సీసా రామారావు పాల్గొన్నారు.

గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ గురుకుల, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాలను శనివారం సంఘం నాయకులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తమ సంఘం తరుపున ప్రతి పాఠశాల, కళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకొని తక్షణ పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. మెనూ అమలు చేయాలని, రెగ్యులర్‌గా హెల్త్ చెకప్‌లు చేయాలని, ఎఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు ఈతపల్లి సిరిమల్లె రెడ్డి, మట్ల వాణిశ్రీ, కంభం శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

కేసు వివరాలు వెల్లడిస్తున్న సిఐ గజేంద్ర కుమార్

జంట హత్య కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని ఎర్రంపేట గ్రామంలో ఇటీవల జరిగిన జంట హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సిఐ గజేంద్ర కుమార్ తెలిపారు. శనివారం చింతూరు పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు సిఐ కేసు వివరాలు వెల్లడించారు. డిసెంబర్ రెండో తేదీన ఎర్రంపేట గ్రామంలో జరిగిన జంట హత్యకు సంబంధించి వివాహేతర సంబంధం, ఆర్థిక లావాదేవీలు కారణంగా పథకం ప్రకారం ఈ జంట హత్యలు జరిగాయని మృతుడు శ్రీకాంత్ తండ్రి ఫిర్యాదు చేసినట్లు సిఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, విచారించామని, నిందితులు నాగేంద్ర, మినప శ్రీను తప్పించుకునే క్రమంలో శక్తి గ్రామంలో ఉన్నారనే సమాచారంతో వెళ్లి ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో చింతూరు ఎస్సై శ్రీనివాస్, మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు పాల్గొన్నారు.

టిడిపి ఇన్‌ఛార్జి మార్పు అవాస్తవం

ప్రజాశక్తి- చింతపల్లి:రాజకీయ నాయకుడు కాని, పార్టీలో లేని వ్యక్తిని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్‌గా నియమిస్తారంటూ పత్రికలలో వచ్చిన వార్తలో వాస్తవం లేదని, ఆ వార్తను చూసి పార్టీ శ్రేణులు అభద్రతాభావానికి గురి కావద్దని తెదేపా చింతపల్లి మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అన్నారు. అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, పలువురు పార్టీ శ్రేణులతో కలిసి శనివారం ఆయన మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకుని కష్ట నష్టాలు ఒడిదుడుకులను తట్టుకొని పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు పనిచేసిన, చేస్తున్న ఎంతోమంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారన్నారు. అటువంటి నాయకులలో మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి నియోజకవర్గ ఇన్చార్జ్ గా ఉన్నారన్నారు. వైకాపా ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పార్టీని విజయ తీరాలకు చేర్చేందుకు ఎంతో కృషి చేస్తున్న నాయకులు ఎందరో ఉన్నారన్నారు.తప్పుడు వార్తలు రాయించుకుని పార్టీ శ్రేణులను అభద్రతా భావానికి గురి చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బేతా నాగు, గబులంగి అప్పారావు, దేవుడు బాబు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

కొనసాగిన గాలింపు

ప్రజాశక్తి- అనంతగిరి:లువ్వా గెడ్డలో గల్లంతయిన మృతదేహం కోసం గాలింపు చర్యలు శనివారంతో నాలుగు రోజులకు చేరుకుంది స్థానిక ఎస్ఐ రాము ఆధ్వర్యన మూడు బృందాలుగా ఏర్పడి ఎన్టీఆర్ఎఫ్ గెడ్డ ఇరువైపులా గాలించాయి. తాటిపూడి జలసయం వద్ద ముమ్మరంగా జల్లెడ పట్టారు. అయినా లభ్యం కాలేదు. మృతదేహం ఎక్కడో చోట ఊబిలో కూరుకు పోయి ఉండవచ్చునని ఎన్డీఆర్ఎఫ్ బృందాలు భావిస్తున్నాయి. కుటుంబ సభ్యులు తిండి తిప్పలు లేకుండా రాత్రి పగలు కన్నీరు మున్నేరుతో విలపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శంకర్రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -మాకవరపాలెం:మాకవరపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం పిఎం మాతృత్వ సురక్ష యోజన పథకంలో భాగంగా గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి సీతారామహాలక్ష్మీ ఆధ్వర్యంలో సుమారు 50 మంది గర్భిణీలకు బీపీ, రక్త పరీక్షలు చేశారు.

పింఛను మంజూరు చేయాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని గుంటగన్నేల పంచాయతీ సోలాప్ గూడ గ్రామంలోని అందురాలైన కిలో కరుణ అనే బాలికకు వెంటనే వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ అల్లూరి జిల్లా కన్వీనర్ సుజాత సాల్మన్ డిమాండ్ చేశారు. గురువారం ఆ గ్రామంలో ఆమె సందర్శించి ఓటు నమోదు కార్యక్రమం చేపట్టారు. తల్లిదండ్రులు లేని అనాధ బాలిక అందురాలైన కరుణకు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అన్నారు. వెనక ముందు ఎవరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతుందని చెప్పారు. పింఛన్లు చేయించుకోవడానికి అవగాహన లేక అనేకమంది ఇటువంటి అభాగ్యులు పింఛన్లకు నోచుకోలేకపోతున్నారని చెప్పారు. తక్షణమే స్థానిక సచివాలయ సిబ్బంది స్పందించి వెంటనే అందురాలైన అనాధ బాలికకు వెంటనే పింఛన్ మంజూరు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాలికతో మాట్లాడుతున్న సుజాత

శిథిలావస్థలో ప్రధాన రహదారి

ధారాలమ్మ ఘాట్ రోడ్ నుంచి ఆర్‌వి.నగర్ వరకు పెద్ద పెద్ద గోతులు

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు నుండి చింతపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో ధారాలమ్మ ఘాట్ రోడ్డు నుంచి ఆర్‌వి.నగర్ మధ్యలో రహదారి శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 15 కిలోమీటర్ల మేరకు రహదారి పెద్ద పెద్ద గోతులు పడడంతో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. చిన్న చిన్న వాహనాలతో పాటు మోటార్ సైకిల్‌పై కూడా ప్రయాణించలేని స్థితి నెలకొంది. ఈ మార్గంలో వాహనాలు నడుపుతున్నప్పుడు ఎటువంటి ప్రమాదాలు సంభవిస్తాయే తెలియని పరిస్థితి నెలకొందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో వైద్య సేవ నిమిత్తం నర్సీపట్నం, విశాఖపట్నం రోగులను తరలించాలంటే రహదారి సౌకర్యం బాగోలేక అంబులెన్స్ డ్రైవర్లు నాన అగశాట్లు పడుతున్నారు. రహదారులపై ఎక్కడా గోతులు కనబడకూడదని రాష్ట్ర ప్రభుత్వం పదేపదే ప్రకటనలు చేస్తుండగా, దారాలమ్మ ఘాట్ నుండి ఆర్‌వి.నగర్ వరకు పెద్ద పెద్ద గోతులతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ రహదారిని స్టేట్ హైవేగా అభివృద్ధి చేయాలని కొన్ని సంవత్సరాల క్రితం సర్వేలు నిర్వహించి సంబంధించిన పనులకు టెండర్లు ప్రక్రియ కూడా పూర్తి చేశారని, కాని ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి దారకొండ ఘాట్ రోడ్ నుంచి ఆర్ వి నగర్ మధ్యలో ఉన్న గోతులను తక్షణమే పూడ్చి, శిథిలావస్థ చేరుకున్న రహదారిని నూతనంగా నిర్మించిన చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ కోరారు.

దారకొండ ఘాట్ రోడ్లో పెద్ద పెద్ద గోతులతో ఉన్న ప్రధాన రహదారి

దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి -పాడేరు:ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉద్యోగాల భర్తీకి మరో రెండు రోజులు గడువు పొడిగించామని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 13వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో శిశువు మృతి

ప్రజాశక్తి -అనంతగిరి: అనారోగ్యంతో పుట్టే శిశువులు మృత్యువాతకు గురవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని బొర్రా పంచాయతీ పరిధి కటికి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గెమ్మెల సావిత్రికి జన్మించిన 7 నెల్లల బాబు శనివారం స్వయ గ్రామంలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు స్థానిక విలేకరులకు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-మాడుగుల:తుఫానుతో పంటలు నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని సిపిఎం, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షురాలు కె.భవాని మాట్లాడుతూ, తుఫాన్‌తో వరి పంటలు నేల కొరిగాయని, కొన్ని ప్రాంతాల్లో కుప్పలు తడిసి నీట మునిగాయన్నారు. రైతులు, కౌలు రైతులు పెట్టిన పెట్టుబడి రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని తెలిపారు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించి. పరిహారం అందేవిదంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు ఈ కార్యక్రమంలో వేచలపు తాతబాబు, గాదం కొండబాబు, కొండపల్లి గంగరాజు, అక్కిరెడ్డి పరదేశి, నాయుడు రైతులు తదితరులు పాల్గొన్నారు.

జెసిఎస్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా గోవిందు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని అమలాపురం పంచాయతీ మూలపర్ర గ్రామానికి చెందిన వైసిపి నాయకులు సూరకాసుల గోవిందు జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు వెలుబడ్డాయని గోవిందు స్థానిక విలేకరులకు తెలిపారు. తమపై ఉన్న నమ్మకంతో జే సీ ఎస్ జిల్లా కోఆర్డినేటర్ గా నియమించి నందుకుగాను సీఎం జగన్ మోహన్‌రెడ్డి, ఉత్తరాంధ్ర వైఎస్ఆర్ సిపి ఇన్చార్జ్ వైవి సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్యే గొల్ల బాబురావు, జెసిఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ చైర్మన్ చిక్కాల రామారావు, నక్కపల్లి మండల పార్టీ శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తిలకు కృతజ్ఞతలు తెలిపారు. పదవి మరింత బాధ్యతను పెంచిందని , మరింతగా పార్టీని బలోపేతం చేసి, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని గోవిందు అన్నారు.

పాఠశాల భవనం మంజూరుకు కృషి

ఉపవిద్యాశాఖాధికారి పి.అప్పారావు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని పెదబోదుగల్లం లో శిధిలంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులను శనివారం యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు పరిశీలించారు. తుఫాన్ ప్రభావానికి కురిసిన వర్షానికి తరగతి గదుల శ్లాబ్ పెచ్చులూడి పడడంతో స్థానిక మండల విద్యాశాఖాధికారి కె.నరేష్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళారు. భవనం శిథిలావస్థకు చేరడంతో ఇప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారని, సమస్యను పరిష్క రించాలని జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఉపవిద్యాశాఖాధికారి పి.అప్పారావు పాఠశాల తరగతి గదులను పరిశీలించారు. శిథిలమైన తరగతి గదులను ఉపయోగించ రాదన్నారు. ఆ తరగతి గదులను బ్లాక్ చేసి పిల్లలను దరి చేరకుండా చూడాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్.సత్యనారాయణ మాట్లాడుతూ, కేవలం ఏడు తరగతి గదులు ఉండగా వాటిలో ఐదు గదులు శిధిలావస్థకు చేరుకున్నాయని, కేవలం రెండు తరగతి గదులలో మాత్రమే తరగతులను నిర్వహించడానికి అవకాశం ఉందని తెలిపారు. పాఠశాల వసతి సమస్యను గుర్తించిన అప్పారావు మాట్లాడుతూ, వీలయినంత త్వరగా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను నివేదించి నూతన తరగతి గదుల మంజూరునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి కె.నరేష్, డి.ఆర్.వో.దయానిధి, పాఠశాల కమిటీ చైర్మన్ మహబూబ్ నిషా, ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్. సత్యనారాయణ, ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు ఉన్నారు.

ఘనంగా చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి

నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటం సాగించిన చెన్నుపాటి లక్ష్మయ్య 55వ వర్ధంతిని యుటిఎఫ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ కన్నయ్య మాట్లాడుతూ, ఆయన పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకాన్ని అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల ట్రెజరర్ ఎం.మోహన్, ఎల్బీ దుక్కు, రాము, మేఘనాథ్ పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:ఉపాధ్యాయ ఉద్యమ పితా మహులు, అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతిని యుటిఎఫ్ మండల అధ్యక్షులు సమరెడ్డి. రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. చెన్నుపాటి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం.ధర్మారావు, మండల అధ్యక్షులు రాజులు మాట్లాడుతూ, ఉపాధ్యాయ సంఘాలు ఐకమత్యంతో విద్యా విధానాల పట్ల సమరశీల పోరాటాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమరెడ్డి రాజు, సీసా. గోపి, శ్రీనివాసమూర్తి, త్రినాధం, సావిత్రి, సుమలత, సూర్యనారాయణ, గోవింద్, చిన్నయ్య, రఘుమణి, మత్స్య రాజు, సుబ్బారావు, రాజేంద్రప్రసాద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి:మండలంలోని శివలింగపురం ప్రభుత్వ బాలుర పాఠశాలలో లక్ష్మయ్య వర్ధంతి నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు పుడిగి, దేవుడు ఉమ్మడి జిల్లా సహా అధ్యక్షులు శెట్టి, రాంబాబు ఆధ్వర్యన వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూపీఎఫ్ నేతలు మాట్లాడుతూ, లక్ష్మయ్య ఉపాధ్యాయ రంగంలో పనిచేస్తూ సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల నాయకులు శెట్టి ,సుబ్బారావు, బి.సింహాచలం, లక్ష్మణరావు, ఈశ్వరరావు, రాజు కుమార్, సింహాద్రి, అప్పలరాజు, అమ్మ రావు, బుద్ధు, రవికుమార్, నాగేశ్వరరావు, ఎల్ సింహాసలం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

చీరలు పంపిణీ చేస్తున్న చైర్మన్

ప్రజాశక్తి- అనంతగిరి: మండల కేంద్రంలోని కిరసాని శ్యామ్ సుందర్ సేవ ఆర్గనైజేషన్ అధ్వర్యంలో వైఎస్ భారతి రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ వీసి, ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్ లజపతిరాయ్ పాల్గొని, పేద గిరిజనులకు చీరలను, గొడవలు పంపిణీ చేశారు. గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. అరకు నియోజకవర్గంలో ఏఎంసి డైరెక్టర్ కిరసాని రామదాసు చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అ సంఘం ఉపాధ్యక్షులు అప్పలకొండ, వైసిపి మండల నాయకులు శెట్టి ఆనంద్, అరకు మాజీ సర్పంచ్ రఘునాథ్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల తయారీపై అప్రమత్తంగా ఉండాలి

సమీక్షా సమావేశంలో కలెక్టర్ పటాన్ శెట్టి

ప్రజాశక్తి -కోటవురట్ల: ఎన్నికల జాబితా తయారీ విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పటాన్ శెట్టి సూచించారు. శనివారం మండల కేంద్రంలో సమావేశ మందిరం వద్ద నియోజకవర్గ ఎన్నికల అధికారి రామలక్ష్మి ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ఆకస్మికంగా హాజరై సమాచారం అడిగి తెలుసుకున్నారు. శనివారంతో ఎన్నికల నమోదు, సవరణ, తొలగింపునకు ఆఖరి రోజు కావడంతో సమగ్ర వివరాలు పొందుపరచాలని అధికారులకు సూచించారు. రాజకీయాలకు అతీతంగా సిబ్బంది విధుల పట్ల చిత్తశుద్ధితో పనిచేయాలని లేకుంటే చర్యలు కఠినంగా ఉంటాయని గుర్తించాలన్నారు. సామాన్యుల పట్ల ఏకపక్ష ధోరణి తగదని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకట జయరాం, తహసిల్దార్ జానకమ్మ, ఎన్నికల సూపర్వైజర్లు, బూత్ బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: ఓటర్ల జాబితా రూపకల్పనకు సిబ్బంది శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశించారు. శనివారం మాకవరపాలెం మండలం తామరంలో నిర్వహించిన ఓటర్ల సవరణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ శిబిరంలో వచ్చిన కొత్త ఓట్ల నమోదు, తొలగింపులు, చేర్పులపై అందిన దరఖాస్తులను తనికీ చేసి సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట ఆర్డీవో జయరాం, తహశీల్దార్ ప్రసాదరావు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

వడ్డాది: తుఫాన్‌తో దెబ్బతిన్న వడ్డాది శారద నదిపై ఉన్న వంతెన మరమ్మత్తులు వెంటనే పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి ఆదేశించారు బుచ్చియ్యపేట మండలం వడ్డాదిలో శనివారం ఆయన పర్యటించారు ఈ సందర్భంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో కలెక్టర్ మాట్లాడుతూ, తుఫాన్ ప్రభావంతో రహదారులు, వంతెనలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ముఖ్యంగా రైతులు వరి, చెరుకు పంటలు ఎక్కువగా నష్టపోయారని తెలిపారు. పంట నష్టాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. మరో రెండు రోజుల్లో వంతెన మరమ్మతులు చేపట్టి వాహనదారులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, జడ్పిటిసి దొండా రాంబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

14న గ్రామీణ కష్టజీవుల ధర్నా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:వలసలు, కరువు నివారణకు ఉపాధి హామీ పనులు ప్రతి గ్రామంలో ప్రారంభించి, కష్ట జీవులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెలుగుల అర్జునరావు, మాకిరెడ్డి రామానాయుడు డిమాండ్ చేశారు. ఈ నెల 14న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే గ్రామీణ కష్టజీవుల ధర్నా పోస్టర్లను ఆవిష్క రించారు. అనంతరం వారు మాట్లాడుతూ, కమ్యూనిస్టుల మద్దతుతో ఏర్పాటైన ఆనాటి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించిందన్నారు. ఉపాధి పని ప్రదేశంలో పని చేస్తూ ప్రమాదవశాత్తు మరణిస్తే పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కమిషన్ పెంచాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉద్యోగ భద్రత కల్పించి వారిపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు శివలంక కొండలరావు, రాష్ట్ర సమితి సభ్యురాలు చింతలపూడి విజయలక్ష్మి, చోడే శ్రీనివాస్ చౌదరి, రైతుసంఘం నాయకులు గొల్లు గురుబాబు, రాజారామ్ మోహన్ రాయ్ పాల్గొన్నారు.

11న పాయకరావుపేటలో 'యువగళం'

- లోకేష్‌కు భారీగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-నక్కపల్లి:జిల్లాలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ చేపట్టనున్న యువ గళం పాదయాత్రను విజయవంతం చేయడానికి టిడిపి శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. ఈ యాత్రలో పెద్ద ఎత్తున ప్రజలను భాగస్వాములు చేసేందుకు నాయకత్వం ప్రణాళిక తయారు చేసింది. పాయకరావుపేట నియోజకవర్గంలో ఈ నెల 11న లోకేష్ ప్రవేశించనున్నారు. లోకేష్‌కు పెద్ద ఎత్తున కార్యకర్తలు స్వాగతం పలకాలని పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని సారిపల్లివాని పాలెం వద్ద తన ఇంటి ప్రాంగణంలో శనివారం జరిగిన పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో అనిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లోకేష్ పాదయాత్ర 11న పాయకరావుపేట చేరుకొనేటప్పుడు పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. 12న పాయకరావుపేట వైభవ్ లే-అవుట్ దగ్గర నుంచి పాదయాత్ర బయలుదేరుతుందన్నారు. గొడిచర్లకు పాదయాత్ర చేరేసరికి పదివేల మంది మహిళలతో స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 13 వరకు పాదయాత్ర కొనసాగుతున్నందున నియోజక వర్గంలోని కార్యకర్తలు, స్థానిక పార్టీ బాధ్యులు మండల ఇన్‌ఛార్జ్‌లతో సమన్వయం చేసుకోవాలన్నారు. పాదయాత్ర నియోజవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర ముఖద్వారం పాయకరావుపేట నియోజకవర్గంలో లోకేష్‌కు పలికే స్వాగతం ప్రజల మనస్సుల్లో నిలిచి పోయేలావుండాలన్నారు.

పరిహారం.. సందేహమే..

కంటితుడుపుగా నేతలు, అధికారుల పర్యటనలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట: తుఫానుకు తీవ్రంగా నష్టపోయిన వరి రైతును ఆదుకోవడంలో ప్రభుత్వం ప్రకటనలకే, ప్రచారానికే పరిమితమైతుంది తప్ప ఆదుకునే ఉద్దేశం లేనట్లు రైతులు వాపోతున్నారు. నేటికీ తుఫానుల దాటికి ఐదు రోజులు పైగా అయింది. బుచ్చయ్యపేట మండలంలో వడ్డాది, కుముందానిపేట, మంగళాపురం, బంగారుమెట్ట, చిన్నప్పన్నపాలెం, పోలేపల్లి తదితర వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. నాలుగైదు రోజులు నీటిలో వరి ఎన్నులు నుండి మొలకలు మొలుస్తున్నాయి. కానీ, వ్యవసాయ శాఖ అధికారులు, నేతలు పర్యటనలు, పరిశీలనలు కంటి తుడుపుగానే ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో నష్టపోయిన రైతులు వివరాలను నేటికీ సేకరించలేదు. దీంతో, పరిహారం అందుతుందా అన్న సందేహాలను పలువురు రైతులు వ్యక్తం చేస్తున్నారు. చిన్నప్పన్నపాలెం గ్రామంలో వర్షానికి ముందు పండిన వరి పంటను పలువురు రైతులు కోతల కోసి వరి పంటను పొలాల్లోనే విడిచి పెట్టారు. కుప్పలు పెట్టుకునే సమయం సమయానికి వర్షం అధికంగా రావడంతో వరి పంటను పొలాల్లోనే విడిచి పెట్టారు. వర్షపు నీరు పొలాలపై నుండి ప్రవహించింది. అలాగే అనేక మంది తుఫాను ప్రభావానికి తీవ్రంగా నష్ట పోయారు. నష్టపోయిన రైతన్నను ఆదుకోవడానికి వారం రోజులు గడుస్తున్నా చర్యలు శూన్యమని విమర్శిస్తున్నారు.

పవన్‌పై దిగజారుడు వ్యాఖ్యలు సరికావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌పై మంత్రి అమర్‌నాథ్ దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర హితవు పలికారు. శనివారం ఆయన మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్‌ను దూషించడమే అమర్‌నాథ్‌కు మంత్రి పదవి ఇచ్చినట్లు ఉందన్నారు.

పరివర్తన కార్యక్రమంలో పాల్గొన్న సిఐ వెంకటేశ్వరరావు

గంజాయి అమ్మకం, రవాణా చేయొద్దు

ప్రజాశక్తి-రంపచోడవరం :గంజాయి అమ్మకం, రవాణా చేసి యువకులు తమ జీవితాలని పాడు చేసుకోవద్దని సిఐ వాసా వెంకటేశ్వరరావు హితవుపలికారు. మండలంలోని తాటివాడ గ్రామంలో రంపచోడవరం ఎస్.ఐ మోహన్ కుమార్, ఎఎస్ఐ ఎంఆర్‌కె రాజుతో కలిసి సిఐ శనివారం పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి విక్రయం, రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు, ఆన్‌లైన్ మోసాలపైనా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సీలేరు : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు అల్లూరి జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం పెదవలస స్కూల్ కాంప్లెక్స్‌లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో శనివారం సమావేశం నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మూడు నెలల నుంచి బిల్లులు మంజూరు కాక మిడ్డేమీల్స్ కార్మికులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే కార్మికుల పెండింగ్ బిల్లు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల అధ్యక్షులు కంకిపాటి లక్ష్మి, వంతల సూరిబాబు, పడాల రమేష్, పోతురాజు, లోసుకురు గోపాల్ పాల్గొన్నారు.

మిచౌంగ్‌తో పంటలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి-విఆర్.పురం : ఇటీవల సంభవించిన మిచౌంగ్ తుపాన్ వల్ల మూడు రోజులు ఏకధాటిగా కురిసిన భారీలు వర్షాలు, ఈదురుగాలులకు పంటలకు తీవ్ర నష్టం సంభవించిందని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట చేతికి వచ్చే సమయంలో పూర్తిగా దెబ్బతింది. పూత మీద ఉన్న మిర్చి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మరో నెల రోజుల్లో కోతకు వచ్చే సమయంలో తుపాన్ ముంచెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో లంక పొగాకుకు పెట్టింది పేరు. అటువంటి పొగాకు తోటలు వందల ఎకరాలు నీళ్ళల్లో మునిగి నష్టాల పాలయ్యాయి. మొక్కజొన్న పంట సైతం దెబ్బతింది. వేలకు వేలు పెట్టుబడులు పెట్టామని, పంటకు నష్టం జరగడంతో అప్పుల పాలు కావాల్సిన దుస్థితి నెలకొందిని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే దెబ్బ తిన్న పంటలను సర్వే చేసి పూర్తి స్థాయిలో నష్ట పరిహారం ఇవ్వాలని పోలవరం ముంపు మండలాల రైతులు వేడుకుంటున్నారు.

వైసిపికి కార్పొరేటర్ సాధిక్ రాజీనామా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ పార్టీకి, పొల్యూషన్ బోర్డ్ మెంబర్ పదవికి రాజీనామా చేశారు. శనివారం సాయంత్రం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో తనతో పాటు వైసిపికి చెందిన వారంతా అనేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. పలుమార్లు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి వైవి.సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేసినప్పటికీ వారి నుంచి ఎటువంటి స్పందనా రాలేదన్నారు. దక్షిణ నియోజకవర్గంలో అవినీతి తీవ్ర స్థాయిలో ఉన్నట్టు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌తో చాలా మంది కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. వన్ టౌన్ ప్రాంతంలో ఎమ్మెల్యే వాసుపల్లి ఎటువంటి అభివృద్ధి చేయడం లేదన్నారు. వన్ టౌన్ ప్రాంతంలో అధిక సంఖ్యలో ముస్లింలు ఉన్నప్పటికీ వారికి పదవులు ఇవ్వడం లేదన్నారు. దక్షిణ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం పలుమార్లు చెప్పినప్పటికీ పట్టించుకోలేదన్నారు. అందుకే తాను వైసిపికి రాజీనామా చేశానని అన్నారు.

నేవీ విన్యాసాలకు సర్వం సిద్ధం

విశాఖ తీరంలో నేడు యుద్ధ హోరు
ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ రాక
భారీ సంఖ్యలో హాజరుకానున్న ప్రజానీకం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

నింగి, నేల, నీరు.. ఎక్కడైనా శత్రుమూకలను మట్టుపెట్టగలిగే వ్యూహాత్మక ఎత్తుగడలు తూర్పు నౌకాదళం సొంతం. దీని కీర్తి ఎంతో విశిష్టం. అటువంటి మన నేవీ శక్తి సామర్థ్యాలను అందరికీ తెలుసుకోవాలనే ఉంటుంది. ఇంకెందుకు ఆలస్యం.. ఆదివారం విశాఖ తీరానికి వచ్చేయండి. ఇక్కడి విన్యాసాలు ఒళ్లు జలదరింపజేస్తాయి. నావికుల పోరాటాలు గగుర్పాటుకు గురిచేస్తాయి.

ఆర్‌కె బీచ్‌లో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

దేశం గర్వించదగ్గ నేవీ డే వేడుకలు ఈ నెల 4న జరగాల్సి ఉండగా మిచౌంగ్ తుపాను కారణంగా 10కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈసారి ప్రధాన విన్యాసాలను వీక్షించేందుకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఇంకా పలువురు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, గౌరవ అతిథులు, తూర్పునౌకాదళ ఉన్నతాధికారులు రానున్నారు. నగర ప్రజానీకం కూడా పెద్ద ఎత్తున తరలిరానుంది. ఈ నేపథ్యంలో నేవీ, ప్రభుత్వ యంత్రాంగం కూడా భారీ ఏర్పాట్లు చేసింది. ఆర్‌కె బీచ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది.

అబ్బురపరచనున్న విన్యాసాలు

నావికాదళం ఈ సారి అత్యంత అద్భుతమైన ప్రతిభాపాటవాలు, శక్తి యుక్తులతో కూడిన ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. నౌకలు, సబ్‌మెరైన్‌లు, యుద్ధ విమానాలు, ప్రత్యేక నావికాదళ బలగాల సముద్ర తీర ప్రదర్శనలు అబ్బుర పరచనున్నాయి. యుద్ధ సమయాల్లో నౌకలు నిర్వహించే పాత్ర, అందులో దళాల శక్తియుక్తులపై ప్రత్యేకంగా ఆపరేషన్స్‌ను నావికాదళం చేపట్టనుంది. యుద్ధ విమానాలు ఒకదానికొకటి ఎదురెదురుగా దూసుకువస్తూ ఢీకొనేటంతగా చూపరులను నిర్ఘాంతపోయేలాంటి సన్నివేశాలు ఆదివారం కనువిందుచేయనున్నాయి. మెరైన్ కమోండోల సాహసాలు కట్టిపడేయనున్నాయి. నీటిలో స్కై డైవింగులు చిన్న పిల్లలు నుంచి పెద్దల వరకూ అలరించనున్నాయి. ఇప్పటికే నిర్వహించిన నేవీ రిహార్సల్స్ అట్టహాసంగా సాగాయి. మర్గన్ హెలీకాప్టర్ల విన్యాసాలు, బాంబింగ్, రెస్క్యూ ఆపరేషన్, పారాషూట్ విన్యాసాలు ఔరా అనిపించాయి. చేతక్ హెలీకాప్టర్ ద్వారా జాతీయ జెండా ఎగరవేయడం, యుఎక్స్ హెలీకాప్టర్ విన్యాసాలు, హౌక్ విమానాల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వీటన్నింటినీ మించిన నేవీ సంబరం ఆదివారం సాక్షాత్కరించనుంది.

గవర్నర్ పర్యటన ఇలా..

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నేవీ వేడుకలకు ముఖ్య అతిథిగా విశాఖకు రానున్నారు. ఆయన ఆదివారం ఉదయం 11:20 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 12:30 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడి నుంచి 12:40 గంటలకు పోర్టు గెస్ట్ హౌస్‌కు వెళ్తారు. విశ్రాంతి అనంతరం పోర్ట్ గెస్ట్ హౌస్ నుంచి ఆర్‌కె బీచ్‌కు చేరుకొని 4:12 గంటల నుంచి 5:35 గంటల వరకు నేవీ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం 5:40 గంటలకు సిరిపురం నేవీ హౌస్‌కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక తేనేటి విందులో పాల్గొంటారు. 7:20 గంటలకు మరలా ఐఎన్ఎస్ డేగాకు చేరుకొని అక్కడి నుంచి 7:30 గంటలకు ప్రత్యేక విమానం ద్వారా విజయవాడ వెళ్తారు.

శాస్త్రీయ ఆవిష్కరణలకు వేదికగా భారత్ నిలవాలి

మాట్లాడుతున్న నటరాజన్ చంద్రశేఖరన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శాస్త్రీయ ఆవిష్కరణలకు వేదికగా భారతదేశం నిలవాల్సి ఉందని టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ అన్నారు. శనివారం బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిర్వహించిన ఎయు పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం 'వేవ్స్ - 2023'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన దేశం నుంచి నోబెల్ బహుమతులు సాధించే వారి సంఖ్య పెరగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. పరిశోధన రంగానికి పెట్టుబడులు మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మన సమస్యలు ప్రత్యేకమని, మనం చూపే పరిష్కారాలు దేశానికే కాకుండా ప్రపంచానికి దోహదపడుతున్నాయని అన్నారు. దేశంలో వనరులు ప్రజలందరికీ సమానంగా అందుబాటులో ఉండాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రాథమిక వైద్య, విద్యం అందరికీ చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో మహిళలు ఉద్యోగ రంగంలో మరింత ఎక్కువ మంది అడుగిడాలని సూచించారు. ప్రజల తలసరి ఆదాయంలో ఉన్న వ్యత్యాసాలు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఎయు ఇతర విశ్వవిద్యాలయాలకు మార్గదర్శిగా నిలవాలన్నారు. సర్వేపల్లి, సివి.రామన్ వంటి మహనీయులు నడయాడిన ఈ ప్రదేశానికి రావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఎయు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్, జిఎంఆర్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జిఎం.రావు మాట్లాడుతూ సమిష్టిగా లక్ష్యం దిశగా పనిచేస్తే సాధించడం సులభమవుతుందన్నారు.

నటరాజన్ చంద్రశేఖరన్‌కు ఘన స్వాగతం

ఎయు పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌కు ఘన స్వాగతం లభించింది. ఎయు పూర్వ ఉపకులపతి ఆచార్య పివిజిడి.ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు చంద్రశేఖరన్ ఎయు పరిపాలనా భవనానికి చేరుకుని ఎన్‌సిసి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కె.సమత స్వాగతం పలికారు.

దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న సీతారామయ్య తదితరులు

తుపాన్‌కు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-కూనవరం :తుపాన్ వల్ల దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతా రామయ్య డిమాండ్ చేశారు. తుపాన్‌కు దెబ్బతిన్న రోడ్లను సిపిఎం నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ తుఫాను ప్రభావితం వల్ల రేగుల పాడు, కొడెరు, బొజ్జరాయిగూడెం గ్రామాల్లో రహదారులు పూర్తిగా ధ్వంసమైనట్లు చెప్పారు. ఈ రోడ్ల మరమ్మతులకు, లింగాపురం నుండి రేగులపాడు రోడ్డు వంతెనలకు నిధులు మంజూరు చేయాలని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ముల్లూరు నుండి భగవాన్ పురం రోడ్డుకు కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సర్పంచ్ బి.రామారావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు బొగ్గ సుబ్బయ్య, గుండం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా నైట్ సర్వీసులు

ప్రజాశక్తి - సీలేరు : విశాఖ నుండి వయా నర్సీపట్నం, సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే రాకపోకలు సాగించే నైట్ సర్వీస్ బస్సులు శనివారం రాత్రి నుంచి యథావిధిగా నడుస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. డిసెంబర్ 2 నుంచి 8 వరకు మావోయిస్టు వారోత్సవాలు నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా నైట్ సర్వీసు బస్సులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. వారోత్సవాలు ముగియడంతో నైట్ సర్వీసు బస్సు నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రయాణికులు శనివారం నుంచి నైట్ సర్వీస్ బస్సులో ప్రయాణం చేసేందుకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో ప్రాణ త్యాగాలను, భావోద్వేగాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి కర్మాగారం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిలిపివేయాలని ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 982వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసికి చెందిన ఎంఇఎస్ యూనియన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ మహా నగరం ప్రభుత్వ రంగ సంస్థల నిలయమన్నారు. వీటి ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేలాది కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోందన్నారు. ఇటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, ఎంఇఎస్ యూనియన్ నాయకులు పులి రెడ్డి, ఎస్‌కె.బాబ్జీ, సత్తిబాబు, పిటి.రెడ్డి, బుజ్జిబాబు, జోగారావు, పి.వెంకటరావు పాల్గొన్నారు.

వైద్య సేవలపై ఆరా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యులు గొండు సీతారాం వన్‌టౌన్‌లోని ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి (ఘోసాసుపత్రి)ని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. హైరిస్క్ పిల్లల వార్డును, ఇతర వార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యులు అందిస్తున్న సేవలపై బాలింతల నుంచి ఆరా తీశారు. వార్డుల్లో సిసి కెమెరాలను పరిశీలించారు. బరువు తక్కువతో పుట్టిన పిల్లలపై ఎటువంటి వైద్య ప్రక్రియ చేపడుతున్నారో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు నిర్వహించే స్కానింగ్ పరీక్షల్లో లింగ నిర్ధారణ గోప్యత విషయంలో అమలు చేస్తున్న విధి విధానాలపై అక్కడి సిబ్బంది, వైద్యాధికారులు నుంచి సమాచారం రాబట్టారు. వార్డుల్లో అమలౌతున్న సెక్యూరిటీ విధానాన్ని పరిశీలించారు. అలాగే జనన ధ్రువీకరణ పత్రాలు అందించే కార్యాలయాన్ని సందర్శించి ధ్రువీకరణలో తప్పులు దొర్లితే చేపట్టాల్సిన చర్యలపై ఆరా తీశారు.